క్లుప్తంగా

శ్రీరామకోటి పుస్తకాల నిమజ్జనోత్సవం



రామకోటి పుస్తకాలతో వెళ్తున్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం ఎన్నెస్పీ క్యాంప్ రామాలయంలోని స్తూపంలో పొందుపరచిన శ్రీరామకోటి పుస్తకాలను నిమజ్జనం చేసేందుకు భక్తులు బుధవారం భద్రాచలం బయలుదేరారు. మేళతాళాల నడుమ 50 మంది శ్రీరామగిరి భక్తమండలి సభ్యులు ఆలయ ప్రధానార్చకులు సముద్రాల వేంకట నరసింహాచార్యులు నేతృత్వాన వెళ్లారు. అక్కడ శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో సంకీర్తన నిర్వహించి గోదావరిలో పుణ్యస్నానాలు చేశాక రామకోటి పుస్తకాలను గోదావరి జలాల్లో అర్పించారు.

చెక్కులు అందజేత



చెక్కు అందిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 41వ డివిజన్‌లో లబ్ధిదారులకు మేయర్ పునుకొల్లు నీరజ కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫార్సులతో మంజూరైన చెక్కులను బుధవారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు.

20 నుంచి రాజకీయ శిక్షణా తరగతులు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఎం ఖమ్మం డివిజన్ కమిటీ ముఖ్య ప్రతినిధులతో ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు మూడు రోజులు పాటు నగరంలోని చౌడవరపు వేంకటేశ్వరరావు ఫంక్షన్‌హాల్‌లో రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు పార్టీ డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు, బొంతు రాంబాబు, యర్రా శ్రీనివాసరావు, బోడపట్ల రవీందర్ వివిధ అంశాలపై బోధిస్తారని చెప్పారు.

మారిన విద్యుత్ శాఖ ఉద్యోగుల ఫోన్ నంబర్లు

రఘునాథపాలెం: రఘునాథపాలెం విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోనివినియోగదారుల సౌకర్యార్థం విద్యుత్ సంబంధిత సమాచారం, ఫిర్యాదుల కోసం నూతన ఫోన్ నంబర్లను విడుదల చేశారు. వాటిలో బల్లేపల్లి సెక్షన్‌పరిధి ఐడీఏ ఉప కేంద్రానికి 87124 83612, పాండురంగాపురం లైన్ ఇన్‌స్పెక్టర్ 87124 83611, ప్రశాంత్‌నగర్ లైన్ ఇన్‌స్పెక్టర్ 87124 83609, బాలపేట లైన్‌మెన్ 87124 83609, బల్లేపల్లి ఏఈ 87124 83613 నంబర్లను సంప్రదించాలని విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. అలాగే రఘునాథపాలెం సెక్షన్‌పరిధిలో రఘునాథపాలెం లైన్ ఇన్‌స్పెక్టర్ 87124 83623, ఏఈ 87124 83624 నంబర్లు కాగా మంచుకొండ సెక్షన్ పరిధి బావోజీతండా ఉప కేంద్రానికి 87124 83614, ఈర్లపూడి ఉప కేంద్రానికి 87124 83615, కోట్లపాడు ఉప కేంద్రానికి 87124 83616, మంచుకొండ ఉప కేంద్రానికి 87124 83619, పంగిడి ఉప కేంద్రానికి 87124 83620, మంచుకొండ టౌన్ లైన్ ఇన్‌స్పెక్టర్ 87124 83617, మంచుకొండ రూరల్ లైన్ ఇన్‌స్పెక్టర్ 87124 83618, మంచుకొండ సబ్ ఇంజనీర్ 87124 83622, ఏఈ 87124 83621 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పశుగ్రాసానికి విరాళం



విరాళం అందిస్తున్న దాత

ఖమ్మంఅర్బన్: నగరంలోని గొల్లగూడెంలో గల ఓం శ్రీ కృష్ణ గోశాలకు పశుగ్రాసం అందించేందుకు పలువురు దాతలు బుధవారం విరాళాలు అందించినట్లు గోశాల బాధ్యులు తెలిపారు. ఖమ్మంకు చెందిన ఆదిషమిల్లి సత్యనారాయణ రూ.12,116, చెరుకూరి రాధిక అదే మొత్తాన్ని విరాళంగా అందించారు. ఈమేరకు దాతలకు గోశా నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

పంట మార్పిడితో అధిక లాభాలు

నేలకొండపల్లి: పంట మార్పిడితో అధిక లాభాలు పొందాలని వైరా కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్ రవికుమార్ సూచించారు. బుధవారం స్థానిక వాసవిభవన్‌లో భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పంటపొలాలను తగలబెట్టొద్దని ఎరువులు, క్రిమిసంహార మందులు వాడకం తగ్గించాలని సూచించారు. ఉద్యానవన అధికారి ముత్యాలు, ఏడీఏ సరిత, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, ఏఓ ఎం.రాధ పాల్గొన్నారు.



ఆక్రమణకు గురైన ఎంవెంకటాయపాలెంలోని ప్రభుత్వ భూమి

మట్టి మాఫియా..

ప్రభుత్వ భూములపై అక్రమార్కుల కన్ను

- రాత్రీ పగలు తేడా లేకుండా తోలకాలు
- తవ్విన మట్టిని ఇళ్ల నిర్మాణాలు, వెంచర్లకు తరలింపు
- కాసులు కురిపిస్తున్న అక్రమ దందా
- అయినా పట్టింపులేని అధికారులు

గత దశాబ్ద కాలంగా..

ఖమ్మంరూరల్, కూసుమంచి మండలాల్లో జోరుగా సాగుతున్న ఈ మట్టిదందా అక్రమార్కులపై కాసుల వర్షం కురిపిస్తోంది. గత దశాబ్ద కాలంగా అక్రమార్కులు ప్రభుత్వ భూముల్లోని మట్టిని గుట్టుచప్పుడు కాకుండా రాత్రి వేళల్లో, సెలవు దినాల్లో తరలిస్తున్నారు. ఖమ్మంరూరల్ మండలం తల్లంపాడు, ఆరేకోడు, కాచిరాజుగూడెం, ఎంవెంకటాయపాలెం, గుర్రాలపాడు, పల్లెగూడెం, గోళ్లపాడు, ముత్తగూడెం, ఆరెంపుల, తెల్దారుపల్లి, కూసుమంచి మండలం ముత్యాలగూడెం, చేగొమ్మ, గ్రామాలపై కన్నేసిన అక్రమార్కులు వాటి పరిధిలో ఉన్న మట్టిగుట్టలు, కుంటల నుంచి మట్టిని యథేచ్ఛగా తోడేస్తున్నారు. ఏకంగా పెద్ద జేసీబీలను పెట్టి టిప్పర్లు, ట్రాక్టర్లలో భారీగా మట్టిని తరలిస్తున్నారు. పల్లెగూడెంలో ఓ రాజకీయ నాయకుడు తన పలుకుబడిని ఉపయోగించి ఏళ్లతరబడిగా అక్రమంగా మట్టిని తరలిస్తున్నా.. అధికారులు కన్నెత్తి చూడడం లేదని ఆరోపణలు ఉన్నాయి. మట్టి విలువ ఒక్కో ట్రాక్టర్‌కు రూ.600 నుంచి రూ.1000 వరకు, టిప్పర్‌కు రూ.4 వేలు నుంచి రూ.5 వేల వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

పర్యావరణం, రోడ్ల సంగతేంటి?

ఇదిలా ఉండగా అక్రమార్కులు తమ ఇష్టానుసారం మట్టిని తవ్వడంతో పర్యావరణం దెబ్బతినడంతో పాటు మట్టిని తరలించే రోడ్లు ధ్వంసమవుతున్నాయి. దీంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ద్విచక్రవాహనాలు వెళ్లేందుకు కూడా ఇబ్బందిగా మారింది. అదే విధంగా మట్టిలోడుతో ట్రాక్టర్లు అతివేగంగా వెళ్తుండడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ముత్తగూడెంలో మట్టిలోడు ట్రాక్టర్ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని ఢీకొట్టడంతో మృతి చెందాడు. కాచిరాజుగూడెం నుంచి ఖమ్మం వరకు, చింతపల్లి నుంచి ముత్తగూడెం మీదుగా ఖమ్మం వరకు, వెంకటగిరి, గుర్రాలపాడు మీదుగా ఖమ్మం వరకు నిత్యం వందలాది ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తూ అనేక ప్రమాదాలకు కారణమవుతున్నా.. రెవెన్యూ, మైనింగ్ అధికారులతో పాటు పోలీస్ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో అక్రమదారుల చర్యలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రాజకీయ అండదండలతో..

మట్టి అక్రమ రవాణాలో కొందరు ప్రజాప్రతినిధులు, అధికార విపక్ష పార్టీలకు చెందిన నాయకులు చక్రం తిప్పుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇలా అక్రమ మట్టి దందాలో తలాపాపం తిలా పిడికెడు అన్నట్లు ప్రజాప్రతినిధులు, నాయకులు అండ ఉండడంతో మట్టిదందా రాయుళ్ల అడ్డూఅదుపు లేకుండా రెచ్చిపోతున్నారు. గోళ్లపాడు, పల్లెగూడెం గ్రామాల పరిధిలో అక్రమ దందాపై అధికారులకు ఫిర్యాదు చేస్తే అధికారులకు వారి అనుచరుల నుంచి వేధింపులు తప్పడంలేదు. దీంతో అధికారులు వారి జోలికెళ్లకుండా జంకుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఖమ్మం అర్బన్ మండలం నుంచి గత కొంతకాలంగా వందల కొద్దీ టిప్పర్లు రూరల్ మండలంలోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి.

అక్రమాల్లో ఆరితేరిన కొందరు..

కబ్జాకు కాదేది అనర్హం అన్న చందంగా అందినకాడికి దోచుకుంటున్నారు. కుంటలు, మట్టి గుట్టలు, చెరువులు, ప్రభుత్వ భూములను సైతం వదలకుండా గుల్ల చేస్తున్నారు. మట్టిగుట్టలు కనిపిస్తే చాలు యంత్రాలతో తోడేస్తూ ఇళ్ల నిర్మాణాలు, వెంచర్ల ఏర్పాటుకు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ప్రభుత్వ భూముల్లో మట్టిగుట్టలు కళ్ల ముందే కరిగిపోతున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

– ఖమ్మంరూరల్

తోలకాలను అడ్డుకుంటున్నాం..

ఎక్కడైనా అక్రమంగా మట్టి తోలకాలు జరుగుతున్నాయనే సమాచారం వస్తే వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి రాత్రి, పగలు తేడా లేకుండా దాడులు చేస్తున్నాం. పట్టుబడిన ట్రాక్టర్లను, జేసీబీలను సీజ్ చేస్తున్నాం. సంబంధిత వాహనాల వారికి జరిమానాలు విధిస్తున్నాం. మరిన్ని దాడులు నిర్వహించి అక్రమ మట్టి తోలకాలను అరికడతాం.

– పి. రాంప్రసాద్ ఖమ్మంరూరల్

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



సామగ్రి అందజేస్తున్న డీఈఓ సత్యనారాయణ

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని డీఈఓ సామినేని సత్యనారాయణ, 46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణలు అన్నారు. బుధవారం నగరంలోని జూబ్లీపుర ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దాతల ద్వారా సమకూర్చిన సామగ్రిని పంపిణీ చేసిన సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో ఖమ్మం అర్బన్ ఎంఈఓ శైలజలక్ష్మి, హెచ్‌ఎంలు మధుసూదన్‌రావు, సుధారాణి, ఏఏపీసీ చైర్‌పర్సన్ స్వప్న, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

నగరంలోని ఏఎస్ఆర్ శాంతినగర్ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం 24వ డివిజన్ కార్పొరేటర్ కమర్తపు మురళి ఉచిత పాఠ్య పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు చెప్పిన పాఠాలను అనుసరించి, సమయాన్ని వృథా చేయకుండా చదివితే విజేతలుగా నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోవిందరావు, శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం కృష్ణకుమారి, డాన్‌బాస్కో, కాంగ్రెస్ నాయకులు గంగిశెట్టి శ్రీనివాస్, షేక్ గౌస్, పొలూరి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న కార్పొరేటర్ దంపతులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 48వ డివిజన్ సారథినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం స్థానిక కార్పొరేటర్ తోట గోవిందమ్మ రామారావు దంపతులు చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం అందించడంతో పాటు మనో విజ్ఞానం పెంపొందించేందుకు నాంది పలుకుతున్నాయన్నారు. స్థానిక అంగన్‌వాడీల నిర్వహణకు తమ సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుధా, భార్గవి, ప్రేమ, రమా, ఆయాలు, మాజీ కౌన్సిల్ సభ్యులు వంగాల వెంకట్, స్థానికులు చేతి కృష్ణ, బాబా, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పీజీ కళాశాలలో ప్రచారం

ఖమ్మం సహకారనగర్: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని నాన్ గెజిటెడ్ ఉద్యోగ సంఘం ఆధ్వర్యాన ఈనెల 20న జరుగనున్న ఎన్నికలలో తమ ప్యానల్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని సంఘం ప్రధాన కార్యదర్శిగా బరిలో ఉన్న అభ్యర్థి వల్లాల తిరుపతి అన్నారు. బుధవారం ఆయన నగరంలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో ప్రచారం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాశాలలో విధులు నిర్వహిస్తున్న నాన్ గెజిటెడ్ ఉద్యోగులు తమ ఓటును తమ ప్యానల్ అభ్యర్థులకు వేసి గెలిపించాలని కోరారు. అధ్యక్షుడిగా బి.నవీన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా యూనస్ మహమ్మద్, ప్రధాన కార్యదర్శిగా వల్లాల తిరుపతి, సహాయ కార్యదర్శులుగా ఎ.సతీష్‌బాబు, టి.ప్రభాకర్, కోశాధికారిగా తాటి దామోదర్ తమ ప్యానల్ తరఫున పోటీలో ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాన్ గెజిటెడ్ ఉద్యోగులు బి.శ్రీనివాస్, పి.అమర్నాథ్, వేణుగోపాల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన లగ్గిశెట్టి చిన్నమ్మాయి కుటుంబానికి కాంగ్రెస్ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు బుధవారం పరామర్శించి రూ.5300 ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. పార్టీ నినాదాలతో సామాజిక సేవలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని సభ్యులు పేర్కొన్నారు.

ఏఈల కేటాయింపు

ఖమ్మంమయూరిసెంటర్: జోనల్ కార్యాలయాల పరిధిలో విధులు నిర్వర్తించేందుకు అధికారుల కేటాయింపు కొనసాగుతోంది. సర్కిల్ వారీగా బుధవారం ఇంజనీరింగ్ అధికారులను కేటాయిస్తూ కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య నిర్ణయించినట్లు తెలిసింది. ఎన్టీఆర్ సర్కిల్‌కు ఏఈ యాకుబ్, మమత సర్కిల్‌కు ఏఈ యాకుబ్‌నాయక్, పాత మున్సిపల్ సర్కిల్‌కు ఏఈ షమ, కేఎంసీ కొత్త కార్యాలయానికి ఏఈ నరేందర్ తేజ, గాంధీచౌక్ సర్కిల్‌కు ఏఈ వరుణ్, పారిశుద్ధ్యం, ఉద్యానవనంకు ఏఈ కుమారస్వామిని కేటాయించారు.

దివ్యాంగుల తిరంగా ర్యాలీ..

నేలకొండపల్లి: దేశ రక్షణ కోసం ప్రాణాలను లెక్క చేయకుండా యుద్ధం చేసిన సైనికులకు మద్దతుగా తెలంగాణ దివ్యాంగుల జేఏసీ ఆధ్వర్యాన బుధవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో సాగిన ఈ ర్యాలీలో జాతీయ జెండాలను చేతపట్టి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, నాయకులు రవికుమార్, మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, మల్లెబోయిన గోవిందరావు, కొండా హర్ష, జేఏసీ చైర్మన్ పీ.వీ.చలమయ్య, బాకీ రామకృష్ణ, చిర్రా భిక్షం, మద్దెల గురు, వీరన్న, తేజావత్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



జెండాకు వందనం చేస్తున్న నాయకులు

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే అంబేడ్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు చేయాలని దళిత గిరిజన ఆదివాసీ జేఏసీ డిమాండ్ చేసింది. బుధవారం ఈమేరకు ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ నెల 26న హైదరాబాద్‌లో దళిత గిరిజన ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యాన చేవెళ్ల డిక్లరేషన్‌పై నిర్వహిస్తున్న రౌండ్ టేబుల్ సమావేశ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు బొంకూరి సురేందర్ సన్ని, ముత్యపగ్గర్సింగ రావ్, తెలంగాణ ఉద్యమకారుడు పాలకుర్తి కృష్ణ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన 12 అంశాలతో కూడిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు జిల్లా నాయకులు కొమర బత్తిని రాజేష్, ఆదివాసీ ఎరుకల సంఘం జిల్లా నాయకులు నాగేశ్వరరావు , వసంత సీతారాములు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభల పోస్టర్లు..

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 21, 22 తేదీల్లో నిజామాబాద్‌లో జరిగే టీయూసీఐ రాష్ట్ర పదవ మహాసభలకు సంబంధించిన వాల్ రైటింగ్‌ను బుధవారం ఖమ్మంలోని తెలంగాణ ప్రగతిశీల మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ వాటర్ సప్లై అడ్డా దగ్గర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా ఖమ్మం ఏరియా కమిటీ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. నగరంలోని మున్సిపాలిటీ కార్మికులకు, హమాలీ ఇతర కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఇళ్లు ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాంతయ్య, పార్థు, బొమ్మకంటి రమేష్, రవి, ఎంకన్న, వీరయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఈవెంట్స్ బ్రోచర్లు..



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఈవెంట్స్‌ను శుక్రవారం నగరంలో నిర్వహిస్తున్నట్లు క్లబ్ జిల్లా గవర్నర్ కొత్త వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఖమ్మంలోని క్లబ్ కార్యాలయంలో ఈవెంట్ వివరాలకు చెందిన బ్రోచర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్యాబినెట్ ట్రెజరర్ గుంటుపల్లి దివాకర్, జిల్లా జాయింట్ సెక్రటరీ రామకృష్ణ, రీజినల్ సెక్రటరీ బూర్లె పుల్లారావు, వాసవీ క్లబ్ నగర అధ్యక్షుడు, కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్ రావు, మహిళా ప్రతినిధులు వనిత, వేముల శశికళ, రాయపూడి జయరాం, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ ఏర్పాటుకు వినతి



భట్టికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, అలాగే విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్–ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ జార్జిరెడ్డి పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐల ప్రతినిధి బృందం ఆధ్వర్యాన బుధవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మందా సురేష్, ఇటుకల రామకృష్ణ, తుడుం ప్రవీణ్, గోకినపల్లి మస్తాన్, వంగూరి వెంకటేష్, మాట్లాడుతూ.. ప్రజాపరిపాలనలో నియంత్రణ పోకడలను, అక్రమ అరెస్టులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. విద్యార్థుల సమస్యలను వెంటనే తీర్చాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో మడుపల్లి లక్ష్మణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన పెద్దాస్పత్రి కార్మికులు

ఖమ్మంవైద్యవిభాగం: పెండింగ్ వేతనాల సమస్య పరిష్కారం లభించకపోవడంతో పెద్దాస్పత్రి కార్మికులు మరోమారు విధులు బహిష్కరించారు. మూడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఈ నెల ప్రారంభంలో కార్మికులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. మూడు రోజుల పాటు విధుల్లో చేరకుండా పెద్దాస్పత్రిలో ఆందోళన చేసినా సమస్య పరిష్కారం కాకపోవడంతో గత వారం కార్మికులు అంతా కలిసి హైదరాబాద్ డీఎంఈ కార్యాలయం వద్ద ధర్నా చేయగా.. రెండు, మూడు రోజుల్లో జీతాలు చెల్లిస్తామని అధికారుల హామీ ఇవ్వడంతో వెనుదిరిగి విధుల్లో చేరారు. అయితే హామీ ఇచ్చి వారం రోజులైనా జీతాలు పడకపోవడంతో బుధవారం కార్మికులు అంతా కలిసి ఆస్పత్రి ఎదుట ఉన్న షెడ్డులో నిరసన తెలిపారు. గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు కార్మిక నాయకులు వెల్లడించారు. పెండింగ్ వేతనాలు చెల్లించే వరకూ పోరాడతామని హెచ్చరించారు.

ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మంలోని స్తంభాద్రి ఆస్పత్రిలో బుధవారం విశ్రాంత పోలీస్ అధికారులకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.రాధాకృష్ణమూర్తి, రుద్ర వెంకటనారాయణల ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండె, నాడీ వ్యవస్థ వైద్య నిపుణులు పేర్ల హర్ష తేజ, గట్టినేని సురేష్‌లు విశ్రాంత అధికారులకు పరీక్షలు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ధూమపానం, మద్యం సేవించరాదని, కనీసం అరగంట నడక సాధన లేదా యోగా చేయాలన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, ఆస్పత్రి పీఆర్ఓ ఇషాక్ పాషా పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను ఆపాలి

నేలకొండపల్లి: ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను కాల్చి చంపే విధానాన్ని ఆపాలని వెంటనే సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కర్నాటి భానుప్రసాద్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టేందుకే కేంద్రం కుట్ర పన్నుతుందన్నారు. మావోయిస్టులను అంతం చేయకుండా వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కేంద్రం జోక్యం చేసుకుని వెంటనే చర్చలు జరపాలన్నారు. ఆదివాసులకు అండగా నిలుస్తున్నందుకు మావోయిస్టులను నిర్మూలించడం కోసమే ఈ ఆపరేషన్ తీసుకొచ్చిందని మండిపడ్డారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పాలపాటి అశోక్, కాశిబోయిన అయోధ్య, చిర్రా ప్రసాద్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

తిరుమలాయపాలెం: పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మక్కపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ నిరుపేదకు ఇళ్లు అందాలని మంత్రి శ్రీనివాసరెడ్డి కృషి చేస్తున్నారని, లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీఓ షేక్ సిలార్‌సాహెబ్, మాజీ ఎంపీపీ బోడా మంగీలాల్, నాయకులు ఉన్నం రాజశేఖర్, పత్తి నాగేశ్వరరావు, గుగ్గిల అంబేద్కర్, షేక్ సైదుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల ఈ–ఫైలింగ్‌పై వినతి

ఖమ్మంలీగల్: ఈ ఫైలింగ్‌పై బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గద్దల దిలీప్‌కుమార్ ఐఏఎల్ ఆధ్వర్యాన బుధవారం జిల్లా అధ్యక్షుడు షేక్ లతీఫ్, కార్యదర్శి ఓరుగంటి శేషగిరిరావులు బార్ అసోసియేషన్‌కు వినతిపత్రం అందజేశారు. న్యాయవాదులు ఎదుర్కొంటున్న ఈ ఫైలింగ్ సమస్యలపై చర్యలు తీసుకోవాలని వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పట్టణ అధ్యక్షుడు జీవీ లక్ష్మీనారాయణ, కార్యదర్శి ఎం.సతీష్, మహిళా కార్యదర్శి షేక్.నస్రీన్, దామోదర్‌బాబు, కె.మన్మథరావు, శ్రీనాథ్, కె.చంద్రశేఖర్, మందా రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి

తిరుమలాయపాలెం: ప్రధాని నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన 11 ఏళ్ల పాలనలో దేశం అభివృద్ధిపథంలో పరుగులు పెడుతుందని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అన్నారు. బుధవారం తిరుమలాయపాలెంలో బీజేపీ పాలనలో అందిస్తున్న పథకాలను వివరిస్తూ నిర్వహించిన సంకల్ప సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అవినీతి రహిత పాలన అందిస్తూ పార్టీలకతీతంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. అనంతరం అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తక్కెళ్లపల్లి నరేందర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు గుండా శ్రీనివాసరెడ్డి, పాలేరు అసెంబ్లీ కన్వీనర్ మేక సంతోష్‌రెడ్డి, మండల అధ్యక్ష,కార్యదర్శులు బొడ్డుపల్లి ప్రసాద్, నల్లగట్టు శ్రీనివాస్, నాయకులు గుండా గోవర్ధన్, మెట్టు ఆంజనేయులు, వీరభద్రం, వెంకట్రాం, భిక్షం, వినోద్, హనుమా, కృష్ణయ్య అనిల్, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్లు చెల్లించాలి

నేలకొండపల్లి: ఉపాధ్యాయుల రిటైర్మెంట్ బెనిఫిట్లు వెంటనే చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 మార్చి నుంచి రిటైర్మెంట్ బెనిఫిట్లు చెల్లించాలని, విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులను నియమించాలని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కట్టా పద్మ, అరవింద్‌కుమార్, మండల అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, టి.గురవయ్య పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలి

కామేపల్లి: మండలంలోని పింజరమడుగులో ఇటీవల దళితులపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తూరుగంటి అంజయ్య మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం ఇటీవల గ్రామంలో అధికార పార్టీ నాయకులు జరిపిన దాడిలో గాయపడిన దళితులను పరామర్శించి మాట్లాడారు. పోలీసులు వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండలాధ్యక్షుడు పాటిబండ్ల ప్రసాద్, పగిడిపల్లి ప్రభాకర్, మామిడాల మోహన్‌రావు, ఆదూరి ప్రసాద్, ఆదేర్ల రాములు, ఉపేందర్, అంజయ్య, నాగేంద్రబాబు, శ్రీనివాస్, మధు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

ఖమ్మం మామిళ్లగూడెం: వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఖమ్మం నగరపాలక సంస్థ ఆధ్వర్యాన బుధవారం 23వ డివిజన్, రోడ్ నంబర్ 3లో హౌస్ హోల్డ్స్‌కు తడి చెత్త, పొడి చెత్తతో పాటు హానికరమైన చెత్త గురించి అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తడి చెత్త, పొడి చెత్త, హానికర చెత్తను వేరుచేయు విధానంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్లాస్టిక్ వినియోగానికి సంబంధించిన ప్రమాదాలను, దాని దుష్పరిణామాలను కూడా ప్రజలకు వివరించారు.

అల్లుకున్న పచ్చందాలు..



రోడ్డుకు ఇరువైపులా అల్లుకున్న చెట్ల కొమ్మలతో పచ్చందాలు కనువిందు చేస్తున్నాయి. ఆకుపచ్చని తివాచీ రోడ్డుపై పరిచినట్లుగా కనిపిస్తున్న ఈ రహదారి రఘునాథపాలెం మండలం మంచుకొండ–ఈర్లపూడి మార్గంలో ఉంది. ఈ మార్గం గుండా వెళ్లే ప్రయాణికులకు ఇక్కడి చెట్లు ఆహ్లాదాన్ని పంచుతుండడంతో ప్రకృతి అందాలు, చల్లటి వాతావరణాన్ని ఆస్వాదిస్తూ రయ్ రయ్‌మంటూ వెళ్తున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్